


నేడు నగరంలో పలుచోట్ల విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి పట్టణ పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రంలో, విద్యుత్ లైన్లలో నిర్వహణ మరమ్మతులు వలన నగరంలోని పలుచోట్ల శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తిరుపతి పట్టణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.చంద్రశేఖర రావు ఒక ప్రకటనలో తెలిపారు. పరిధిలో గల మంగళం, శెట్టిపల్లె, పీ.డి నగర్, చెన్నయ్యగుంట, వెంకట రెడ్డి కాలనీ, ఏస్ బి ఐ కాలనీ, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, దొడ్డపురం పరిసర ప్రాంతములలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.



లిక్కర్ లక్ ఎవరికో!

- అంగడి పెట్టు..కమీషన్ కొట్టు
- వారికి 'నామినేటెడ్' లేనట్టేనా..
- 227 షాపులకు 3659 దరఖాస్తులు
- ముగిసిన 'తొలి' పర్వం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

నూతన మద్యం పాలసీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అటు ఉంచితే కాసులు వెనకేసుకోవడానికి కూటమి పార్టీల నాయకులు, ముఖ్యంగా తెలుగు తమ్ముళ్లు తమదైన శైలిలో వ్యవహరిస్తూ మద్యం షాపుల టెండర్లను దక్కించుకోవడానికి విఫలయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా దరఖాస్తు చేసుకునే వ్యక్తి తమ మాట వినకుంటే షాపు ఏర్పాటుకు గదులు దొరకకుండా చేయడం, ఒకవేళ షాపు ఏర్పాటు చేసుకున్నా కమీషన్ల రూపంలో అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటే గానీ మద్యం షాపు నడిపే పరిస్థితులు లేవన్నట్లుగా తెలుస్తోంది. తిరుపతి జిల్లాలో 227 షాపులకు 3,659 దరఖాస్తులు అందాయి. సరాసరి ఒక్కో షాపుకు 16 మంది పోటీ పడినట్లు లెక్క. చిత్తూరు జిల్లాలో 104 షాపులకు 2,242 దరఖాస్తులు అందాయి. ఏమైతేనేం 'లోకల్' తలచుకుంటేనే 'లిక్కర్ లక్' అన్నమాట. దరఖాస్తు ఫీజు 2 లక్షలు కాగా 73 కోట్ల 18 లక్షల ఆదాయం ప్రభుత్వానికి వచ్చినట్లే. అయితే మద్యం షాపు దక్కించుకున్న వారికి నామినేటెడ్ పదవి లేనట్లేనని చర్చ నడుస్తోంది. అందుకే మద్యం షాపుల పంపకాలు పూర్తయిన తరువాతనే రెండో విడత నామినేటెడ్ పదవులు ఇవ్వనున్నట్లు సమాచారం.

కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నూతన మద్యం పాలసీ ద్వారా తెలుగు తమ్ముళ్లు తమ వారికే కేటాయింపులు చేసుకోవడానికి తెరచాటు రాజకీయాలు, బెదిరింపులు చేస్తున్నారని సమాచారం. తిరుపతి జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 227 మద్యం షాపులకు ఈనెల ఒకటో తేదీన జిల్లా కలెక్టర్ దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. దరఖాస్తు రుసుము 2 లక్షల రూపాయలుగా అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో మద్యం షాపుల లైసెన్సు పొందడానికి ఔత్సాహకులకు కూటమి పార్టీల నాయకుల నుండి ఒత్తిళ్లు, బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. జిల్లాలోని నియోజకవర్గాలలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులు తమ వారికే మద్యం షాపులు దక్కించుకోవడానికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చక్రం తిప్పుతున్న 'లోకల్' ప్రజాప్రతినిధులు

తిరుపతి నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే గతంలో వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తిరుపతిలో ఉన్న వైసిపి నాయకులతో సంబంధాలను కలిగి ఉండటంతో తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ప్రకటించిన 32 షాపులకు గాను స్థానిక జనసేన పార్టీకి చెందిన వ్యక్తులు వైసిపి నాయకులతో కలసి దరఖాస్తులు చేసుకొని, సిండికేట్ అయ్యేట్టు ఒప్పందాలు కుదుర్చుకున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది. చిత్తూరు నియోజకవర్గంలో టిడిపి, బిజెపి పార్టీలతో కలిసి మాజీ జడ్పీ చైర్మన్ భర్త మద్యం పాలసీకి సంబంధించి దరఖాస్తులలో అన్ని తానై వ్యవహరిస్తున్నట్లుగా విమర్శలు ఉన్నాయి. పీలేరు నియోజకవర్గంలో మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడు ప్రస్తుత ఎమ్మెల్యే మద్యం షాపులు దక్కించుకున్న వారి నుండి కమిషన్లు కోరుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు మద్యం టెండర్లు దక్కించుకోవడానికి ఔత్సాహితులకు నేరుగా బెదిరింపులు చేస్తున్నారని ప్రచారం జరుగుతుంది. సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల పరిధిలో మాజీ ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి చక్రం తిప్పుతూ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని తమ వారికే షాపులు వచ్చేలా లాబియింగ్ చేస్తున్నారని ప్రచారం జరుగుతుంది. సూళ్లూరుపేటలో సిండికేట్‌గా మారి కొన్ని షాపులకు చాలా తక్కువ దరఖాస్తులను వేసినట్లు సమాచారం. ఏదిఏమైనా నూతన మద్యం పాలసీ 'ప్రైవేట్'లో ఏరులై పారనుంది. కూటమి నాయకులకు కమీషన్లను తెచ్చి పెట్టనుంది. మద్యం వ్యాపారంలో 20 శాతం గిట్టుబాటు అవుతుందని లెక్కలు వేసి మరీ సిండికేట్ అవుతున్నట్లు సమాచారం.



ధరల 'మంట'.. పండగ 'ఎట్టా'

- భారంగా నిత్యావసరాలు
- దసరాకు ఉడకని ప్రసాదాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దసరా అంటే నవరాత్రులు.. ప్రతిరోజూ తొమ్మిది రకాల ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టడం భక్తుల ఆనవాయితీ. మరికొందరు రోజుకో రకం ప్రసాదంతో అమ్మవారికి నైవేద్యం అందిస్తున్నారు. నిత్యావసరాలు, కూరగాయల ధరలు శక్తి స్వరూపిణికి సమర్పించే నవ నైవేద్యాలకూ ధరాఘాతం తప్పడం లేదు. ఇపుడే కాదు, గత రెండేళ్లుగా ధరలు ఆకాశంలోనే ఉన్నాయి. దీంతో సామాన్యులు పండుగలకు దూరమవుతున్నారు.

నవరాత్రుల్లో మొదటిరోజు అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి బెల్లం పొంగలిని నైవేద్యంగా పెట్టారు. రెండోరోజు గాయత్రీ దేవికి ఉడకబెట్టిన పెసలు, పెసరపప్పు పొంగలి, పులిహోర.. మూడోరోజు అన్నపూర్ణకు దద్దోజనం, పాయసన్నం, పొంగలి, కొబ్బరి అన్నం పెట్టారు. ప్రస్తుతం 8వ రోజు దుర్గాదేవిగా అలంకరించి పాయసం, చక్కెర పొంగలి పెట్టారు. శుక్ర వారం మహిషాసుర మర్ధినిగా వడపప్పు, పానకం, పులిహోర, పాయసన్నం.. శనివారం రాజరాజేశ్వరీ దేవికి పాయసన్నం, పులిహోర, కొబ్బరి, అరటి సమర్పిస్తారు. నైవేద్యానికి వాడే వస్తువులన్నింటి ధరలు ప్రస్తుతం కొండెక్కి కూర్చొన్నాయి.

ఈ మూడేళ్లలో ప్రతి సెప్టెంబరులో ధరలిలా..(రూపాయల్లో)

సరుకులు (కేజీ)	2022	2023	2024
బియ్యం గ్రేడ్ 1	52.4	58	62
బియ్యం గ్రేడ్ 2	37.98	40	41
గోధుమ	39.60	41	43
కందిపప్పు	120	170	172
పెసరపప్పు	101	116	117
మినపప్పు	101	112	121
శనగ	71	82	107
వేరుశనగ	108	150	170
పసుపు	225	243	260
కారం	310	361	380
బెల్లం	–	47	53

ఉట్టెక్కిన పూజా సామాగ్రి

ప్రజాశక్తి - వెంకటగిరి, డక్కిలి

దసరా పండుగ అంటేనే వ్యవసాయ పనిముట్లు, వాహనదారులు తమ వాహనాలకు,పోలీసులు ఆయుధాలకు, విద్యార్థులకు పుస్తకాలకు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పూలు, పండ్లు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు ఖచ్చితంగా పూజకు కావాల్సిందే. అయితే పెరటాసి నెల కావడంతో ఈ నెలంతా వీటి ధర అధికంగానే ఉంటుంది. ప్రస్తుతం దసరా సందర్భంగా వీటి ధర రెట్టింపయ్యింది. పూలు, పండ్లు, పూజాసామాగ్రి కొనేందుకు వచ్చిన వారితో వెంకటగిరిలోని మార్కెట్ సందడిగా ఉంది. పండగ నేపథ్యంలో పూల ధరలను వ్యాపారులు అమాంతం పెంచేశారు. రెండు రోజుల క్రితం వరకూ కిలో రూ.50 పలికిన బంతిపూలను కిలో రూ.100కి పైగా అమ్మారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో పట్టణములోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం, పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం , కాత్యాయని దేవి ఆలయం , కాళికామాత ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. గతంలో దసరా పండుగ అంటే ఓ పక్క బొమ్మల కొలువులు, పట్నం నుంచి పల్లెలకు చేరే జనాలతో సందడిగా ఉండేది. దసరా మామూళ్ల కోసం వచ్చేవారు. పులి వేషాలు వేసేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే దసరా అంటే ఉల్లాసంగా ఉండేది. ప్రస్తుతం ఆధునిక యుగంలో సోషల్ మీడియాలోనే గ్రీటింగ్స్ తెలుపుకుంటున్నారు. పూజలు చేసి నైవేద్యాలు తిని, సెలవులను ఎంజాయ్ చేసే పరిస్థితి.

శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

విజయ దశమి పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలను కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జెసి శుభం బన్సల్, డిఆర్ఓ పెంచల కిషోర్ తెలియజేశారు. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో సిరిసంపదలతో తుల తూగాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.

పేదలకు చీరలు పంపిణీ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి దసరా సందర్భంగా పట్టణ శివారులోని రాజీవ్ నగర్ యానాదులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బందమ్మ శుక్రవారం ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. పేదలు కూడా ఈ దసరాను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం గిరిజన మహిళలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోండి

తిరుపతి టౌన్ : సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వినియోగదారుల సంఘ అధ్యక్షులు పి.రాజారెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో "జాతీయ సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా 'ప్రజలారా మేల్కోండి' గోడ పత్రికను ఆవిష్కరించారు. ప్రజల చేతిలో పాశుపతాస్త్రం సమాచార హక్కు చట్టం అను కరపత్రాన్ని విడుదల చేశారు. ఏ సమాచారాన్నయినా శీఘ్రంగా, సులభంగా అందజేసి అవినీతి అధికార దుర్వినియోగాన్ని, బాధ్యత రాహిత్యాన్ని అరికట్టడం ముఖ్య ఉద్దేశ్యమైన ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసులు, ఉద్యమకర్తలు కుమారస్వామి నాయుడు, వి.మునిచంద్రారెడ్డి, ఉపేంద్ర, గాంధీ మురళీమోహన్ పాల్గొన్నారు.



తిరుపతిలో చిరుజల్లులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో ఉదయం నుంచి వేడిగా ఉన్న వాతావరణం, సాయంత్రానికి చల్లబడింది. ఓ వైపు ఎండ, మరోవైపు చిరుజల్లులతో తిరుపతివాసులను ఆహ్లాదపరచింది. పలు చోట్ల శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆర్టీసీ బస్టాండ్, టాటా నగర్, తిలక్ రోడ్డు న్యూ బాలాజీ కాలనీ, రుయా సర్కిల్ రేణిగుంట రోడ్డు తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షంతో యాత్రికులు, చిరు వ్యాపారులు కాస్త ఇబ్బందులు పడ్డారు.

93 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఐదుగురు స్మగ్లర్లు అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అటవీ పరిధిలోని నెల్లూరు జిల్లా సోమశిల ప్రాంత సమీపంలో 93 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని ఐదుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులకు అందిన రహస్య సమాచారంతో ఆర్ఐ కె. సురేష్ కుమార్ రెడ్డి బృందంలోని ఆర్ఎస్ఐలు కె.సురేష్ బాబు, టి.విష్ణు వర్ధన్ కుమార్ బందాలు సోమశిల–అనంత సాగరం మార్గంలో ఐదుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో నలుగురిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా, ఒకరు పాండిచ్చేరి ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా గుర్తించామన్నారు. విచారించగా ఎర్రచందనం దుంగల విషయాలను వెల్లడించడంతో వారి నుంచి 93 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. రు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి ఎస్పీ రివార్డులు ప్రకటించారు. ఇందులోని వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి సిద్ధం చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.





'రూటు' మార్చిన ఇసుకాసురులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపుపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో అక్రమార్కులు రూటు మార్చారు. తొట్టంబేడు మండలంలోని విరూపాక్షపురం–పెన్నలపాడు రీచ్ లోకి వాహనాలు వెళ్లకుండా ట్రెంచ్ కొట్టడంతో అక్కడ నదిలో దిగే వీలు లేక దుకాణాన్ని అదే మండలంలోని పెద్దకనపర్తికి మార్చారు. అక్కడ పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టి వెంకటగిరి, మేనకూరు సెజ్, చెన్నైకు తరలిస్తున్నట్లు సమాచారం. పెద్దకనపర్తి వద్ద ఉన్న స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తరలించేందుకు పలు అనువైన మార్గాలు ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది. నది నుంచి సులభంగా బయటపడేందుకనువుగా పెద్ద వంతెన, అక్కడ నుంచి వెంకటగిరి, మేనకూరు–అత్తివరం మీదుగా నాయుడు పేట, నాయుడు పేట – చెన్నై తరలించే అవకాశాలు ఉండడంతో అక్రమార్కులు ఎవరి కంటా పడకుండా ఇసుకను దోచేస్తున్నారని పెద్దకనపర్తి గ్రామస్తులు వాపోతున్నారు. నదికి ఆనుకునే పెద్ద ఎత్తున పంట పొలాలు ఉన్నాయనీ, నదిలో మోటార్లు, నీటి పైపులు కూడా ఉండడంతో తవ్వాకాల్లో అవి దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నదిలోకి వాహనాలు వెళ్లకుండా ట్రెంచ్ కొట్టడంతో పాటు నిఘా పెంచాలని కోరుతున్నారు. ఈ విషయంపై శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డిని వివరణ కోరగా పెద్దకనపర్తి ప్రాంతంలో కూడా ట్రెంచ్ ఏర్పాటు చేస్తామనీ, పోలీస్, రెవెన్యూ అధికారుల నిఘా పెంచుతామని తెలిపారు.

లింగ సమానత్వంతోనే సుస్థిర జీవనం

ప్రజాశక్తి - క్యాంపస్, రేణిగుంట

సుస్థిర జీవనానికి ఆధారం లింగ సమానత్వం, పర్యావరణ సమతుల్యత అవసరమని డాక్టర్ నీరజ అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం మహిళా అధ్యయన విభాగం, ఎన్ఎస్–ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో కుంద్రపాకంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలునిర్వహించారు. డాక్టర్‌నీరజ గ్రామస్తులకు అల్లనేరేడు చెట్లను పంపిణీ చేస్తూ, ఈ ఏడాది థీమ్ 'భవిష్యత్ కోసం బాలికల విజన్' గురించి వివరించారు. బాలికలు స్వతహాగా శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారని, అవి వికసించాలంటే కుటుంబం, సమాజం వారికి తగిన ప్రోత్సాహాన్ని, అవకాశాన్ని, భరోసా కల్పించాలన్నారు. సర్పంచి శుభ, పంచాయతీ సెక్రటరీ ఝాన్సీ, కమ్యూనిటీ కోఆర్డినేటర్ రమేష్, సంఘమిత్ర చెంచులక్ష్మి పాల్గొన్నారు. బాలికా సదనంలో స్త్రీ శిశు సంక్షేమ అధికారి జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. సూపరింటెండెంట్

భవిష్యత్ కోసం బాలికల విజన్



నయోమి, జిల్లా బాలల సంక్షేమ అధికారి శివశంకర్, సోషల్ వర్కర్ దేవయాని, కౌన్సిలర్ కల్పన పాల్గొన్నారు. రేణిగుంట మండలం వెదళ్లచెరువులో ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్‌వాడి కార్యకర్త గంగమ్మ పాల్గొన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లోని వివిధ హోటళ్లు, వస్త్ర దుకాణాల్లో బాల కార్మికులను పనుల్లో పెట్టుకోరాదని, బాల కార్మిక చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ రాజారెడ్డి అవగాహన కల్పించారు.

విజ్ఞాన సమాజ స్థాపనకు కృషి

ప్రజాశక్తి–తిరుపతి(మంగళం)

విజ్ఞాన సమాజ స్థాపనకే తిరుపతి జిల్లా రచయితల సంఘం నిరంతరం కృషి చేస్తుందని, ఆ దిశగా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలను చేపడుతున్నామని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 20 మండలాలతో పాటు నెల్లూరు జిల్లాలోని 14 మండలాలతో కలిసి మొత్తం 34 మండలాలతో తిరుపతి జిల్లా ఏర్పడిన నేపథ్యంలో జిల్లాకు సంబందించిన కవి, రచయితలతో ఇటీవల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక కార్యవర్గాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించేందుకు బాల సాహిత్యానికి సంబంధించిన పుస్తక ప్రచురణలను చేపట్టామన్నారు. ప్రముఖ రచయితలైన డాక్టర్ కేశవరెడ్డి, కలువకొడు సదానంద, కె.సభా, శంకరంబాడి సుందరాచార్యుల రచనలను పాఠకులకు అందుబాటులోకి తేవడానికి కషి చేస్తాం అన్నారు. జిల్లా రచయితల సంఘ కార్యక్రమాలను ఫేస్బుక్, యూట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేస్తామన్నారు. ప్రతి ఏటా సంఘ వార్షికోత్సవం సందర్భంగా ఎంపిక చేసిన ముగ్గురు జిల్లా రచయితలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జిల్లా రచయితల సంఘంలో కవులు, రచయితలు సభ్యత్వం చేసుకోవాలని, డిసెంబర్ 20వ తేదీలోపు సభ్యత్వ రుసుము రూ.1116లను చెల్లించాలని కోరారు. జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, కోశాధికారి ఏనుగు అంకమనాయుడు, రచయితలు పేరూరు బాలసుబ్రమణ్యం, యువశ్రీ మురళి పాల్గొన్నారు.

దశాబ్దాల కల సాకారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ఏళ్ళ నాటి కల సాకారం అయ్యింది. తిరుచానూరు 150 అడుగుల బైపాస్ నుంచి ఉప్పరపల్లి నారాయణాద్రి హాస్పిటల్ వరకు నూతన రోడ్డు మార్గం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఎన్నో సంవత్సరాలుగా తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండడమే కాకుండా ఓ వైపు పందుల సంచారం, రోడ్లపై మురుగునీరు చేరి ఇటు వాహనదారులను, పాదచారులను తీవ్ర అసౌకర్యానికి గురి చేసే మార్గంగా పేరుగాంచింది. గత ప్రభుత్వ హయాంలో మాస్టర్ ప్లాన్‌లో బాగంగా 2.25 కిలోమీటర్ల పొడవున 150 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి అనుమతి వచ్చింది. నిర్మాణ వ్యయం రూ.13.29 కోట్ల రూపాయలుగా అధికారులు అంచనాలు వేశారు. డివైడర్ తో కూడిన 4 లేన్ల రోడ్డుకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు నరసింహా రెడ్డి ప్రజలకు సౌకర్యవంతమైన రోడ్డును తీసుకరావాలని పనులను వేగంగా పూర్తి చేశారు. టిటిడి అధికారులు, కూటమి పార్టీ ప్రజాప్రతినిధులు సహకారం అందివ్వడంతో పనులు వేగంగా చేయగలిగామని గుత్తేదారు తెలిపారు. ఈ 4 లేన్ల రోడ్డు మార్గం పూర్తి కావడంతో ఇటుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లె వారికి ఎంతో ఉపయుక్తంగా



టిటిడి సహకారం

మారింది. గత ప్రభుత్వ హయాంలో ఈ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం, అనుకున్న సమయంలో ప్రజలకు ఈ 4 లేన్ల రోడ్డు మార్గాన్ని అందుబాటులోకి తీసుక రావడం పట్ల వాహనదారులు టిటిడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

'మెనింజైటిస్'కు నివారణ శక్తి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వైష్ణవి పీడియాట్రిక్స్ డాక్టర్ జె.మునిశేఖర్



రోగనిరోధక శక్తి లేనివారికి, రద్దీ వాతావరణంలో నివసించే కళాశాల విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోటానికి, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి టీకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వైష్ణవి ఆస్పత్రి పీడియాట్రిక్స్ డాక్టర్ జె.మునిశేఖర్ తెలిపారు. ప్రియమైన వారిని ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడుకోడానికి 'మెనింజైటిస్'కు నివారణ శక్తి ఉందన్నారు. ప్రపంచ మెనింజైటిస్ దినోత్సవం పురస్కరించుకుని 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ సమస్యను ముందుగా గుర్తించి, టీకా ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 2.5 మిలియన్లకు పైగా మెనింజైటిస్ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఇది తీవ్రమైన ఆరోగ్య సంక్షోభాన్ని సూచిస్తోందన్నారు. ఈ వ్యాధి బారిన పడుతున్న వారిలో ఎక్కువమంది ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలని తెలిపారు. మెనింజైటిస్ సాధారణ లక్షణాలు మెడ పట్టేయడం, జ్వరం, గందరగోళం, మానసిక స్థితి మారడం, తలనొప్పి, వికారం, వాంతులు వంటివి ఉంటాయన్నారు. ఈ ప్రాణాంతక వ్యాధిని ఎదుర్కోవడానికి, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపి) మెనింగోకాకల్ వ్యాక్సిన్‌ను 9–23 నెలల మధ్య 2–డోస్ లుగా ఇవ్వాలని, ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్న 2 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు వారికి ఒక డోస్‌గా సిఫార్సు చేయబడుతుంది.మరింత సమాచారం కోసం 91 9849282502 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అశ్వ వాహనంపై 'కల్కి'

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన శుక్రవారం రాత్రి అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో శ్రీ మలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. ఉదయం వేడుకగా రథోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రికి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో జె. శ్యామలరావు ఆదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్ పాల్గొన్నారు.

'అపాచీ'లో మహిళ హత్య

ప్రజాశక్తి - తడ



తడ మండలంలోని మాంబట్టు వద్ద వున్న అపాచీ పరిశ్రమలో శుక్రవారం యరబోతు వనజ(28) అనే మహిళ హత్య సంచలనం కలిగించింది. హత్యకు వివాహేతర సంబంధాలే కారణమని చర్చ నడుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు అపాచీ 'బి' ప్లాంట్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికురాలు యరబోతు వనజ చిట్టమూరు మండలం కుమ్మరిపాళెం వాస్తవ్యురాలు. అదే మండలానికి చెందిన బురదగాలి గ్రామానికి చెందిన మీజూరు సురేష్ (23) ప్లాంట్‌లోనే మహిళపై కత్తితో దాడి చేశాడు. తోటి మహిళా ఉద్యోగులు ఇన్‌ఛార్జిలకు తెలపడంతో అంబులెన్స్‌లో హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు దారితీసిన వాస్తవ వివరాలు తెలియాల్సి ఉంది.

కన్నతల్లి మందలించిందని..!

చిల్లకూరు మండలంలో దారుణం

ప్రజాశక్తి – చిల్లకూరు



కన్న తల్లి సుశీలమ్మ (45) మందలించిందన్న కోపంతో కొడుకు మనోజ్ (23) కర్రతో తల పగలగొట్టిన దారుణ ఘటన తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం కమ్మవారిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించగా శుక్రవారం ఆమె మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లిని బాగా చూసుకోవాల్సిన కొడుకు దారుణానికి ఒడిగట్టాడు. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో తల్లి సుశీలమ్మ మందలించడంతో విచక్షన కోల్పోయిన మనోజ్ క్రూరమృగంలా కర్రతో తలపై కొట్టాడు. వైద్యం కోసం సుశీలమ్మను గూడూరుకు, తరువాత నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. చిల్లాకూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నేడు శనివారం సురుటుపల్లిలో పర్యటించనున్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి సురుటుపల్లిలో పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో పాల్గొని ఉభయదారుగా వ్యవహరిస్తారు. అనంతరం అమ్మవారి మహిషాసుర మర్ధిని అలంకరణ సేవలో ఎమ్మెల్యే పాల్గొని పళ్లికొండేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అందరు పాల్గొనాలని ఆలయ అధికారులు కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: తిరుపతి లోని అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలం లోని రాజుల కండ్రిగ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మడికాక, ఎండీ పుత్తూరు, సదాశివ పురం, కందాడ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డీవీఏ కేశవ ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు రాజేష్ మార్కెటింగ్, ప్రియా ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో దాదాపు 70 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని తెలి పా రు. సోమవారం పది మందికి శస్త్ర ఆపరేషన్లు చేసి పంపుతామని వైద్యులు తెలిపారు.



వీధి శునకాలను పట్టి తీసుకువెళుతున్న మున్సిపల్ అధికారులు

వీధి శునకాలు పట్టివేత

ప్రజాశక్తి - పుత్తూరు : పుత్తూరు పురపాలక సంఘం కమిషనర్ ఎం మంజునాథ గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారంపై, ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించారు. వీధి కుక్కలను అరికట్టేందుకు ప్రత్యేక నిధులతో తిరుపతి బ్లూ అనిమల్ కేర్ ద్వారా వీధి శునకాలను పట్టివేశారు. పట్టణంలోని 24 వ వార్డు పరిధిలోని రామానాథ శెట్టి వీధి, కళామ్మ గుడి వీధి, బైస్ట్ర వీధి, 25 వ వార్డు పరిధిలోని కాపు వీధి, 26 వ వార్డు పరిధిలోని ధర్మరాజుల గుడి ఏరియా, రాజాజీ వీధిలోని వీధి కుక్కలను పట్టి తిరుపతి బ్లూ అనిమల్ కేర్ కి పంపించి వాటికి స్టెరిలైజేషన్ చేసి రాబిస్ టీకా వేయించి తిరిగి అదే ప్రాంతంలో వదలాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ ఎ హరి, టిడిపి ప్రతినిధులు, శానిటరీ ఇన్స్పెక్టర్ శీను బాబు, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, మేస్త్రిలు, వార్డు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి ఆలయానికి సారె సమర్పణ

ప్రజాశక్తి -రామచంద్రాపురం: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ఎల్ ఎస్ నగర్లోని చాముండేశ్వరి అమ్మ వారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం తుమ్మలగుంట కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సారెను ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తీసుకువెళ్లి సమర్పించారు. ప్రతి ఏటా దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి కళ్యాణ వెంకటేశ్వరుని ఆలయం నుంచి సారెను తీసుకువెళ్లి సమర్పించడం ఆనవాయితీ. ఇప్పటికే కళ్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండగా కంకణధారుడైన చెవిరెడ్డి ఆచారం ప్రకారం గ్రామ పొలిమేర్ల దాటకూడని పీఠంలోనుండడంతో గ్రామ శివార్ల వరకు సారెను తీసుకొచ్చారు. అక్కడ అమ్మవారి ఆలయం వరకు చెవిరెడ్డి చిన్న కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సారెను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఆలయం వద్ద ధర్మకర్త బిరుదాల భాస్కర్ రెడ్డి సారె తీసుకొచ్చిన వారికి సాదరంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేయించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు, పసుపు, కుంకుమలను అందరికీ పంపిణీ చేశారు.

ఘనంగా లక్ష్మీకనకదుర్గమ్మ ఆలయ నవరాత్రి ఉత్సవాలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని 27వ వార్డు రాచ పాలెం గ్రామ సమీపం లోని గుట్టపై వెలసిన లక్ష్మీకనకదుర్గమ్మ ఆలయంలో నవ రాత్రి ఉత్సవ వేడుకలు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎస్ ప్రతాప్ రాజు అధ్యక్షతన నిర్వహి స్తున్నారు. శుక్రవారం నిర్వహించిన నవరాత్రి ఉత్సవానికి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, 27వ వార్డు కౌన్సిలర్ బసంతి, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ ధనపాల్, కప్పన్న, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

దుస్థితిలో వంతెనలు

స్పందించని అధికారులు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: గత ఏడాది కురిసిన తుపాను వర్షానికి నారాయణవనం మండలంలో వరదల ఉధృతం కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగాయి. దీంతో వంతెనలు కొట్టుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ తెగిన వంతెనలకు పూర్తి స్థాయిలో ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ఈ ఏడాది మళ్లీ వరదలు ముంచుకొస్తే గత ఏడాది లాంటి దుస్థితి ఎదురయ్యే ప్రమాదం వుందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

వరదలకు మండలంలో పలు కాజ్‌వేలు, వంతెనలు దెబ్బతిన్నాయి. కొన్ని పాక్షికంగా దెబ్బతినగా, మరికొన్ని చిన్నాభిన్నమై రాకపోకలను స్తంభింప చేశాయి. వర్షాలు తగ్గిన అనంతరం తాత్కాలికంగా మట్టిని వేసిన ప్రజా ప్రతినిధులు చేతులు దులుపుకున్నారు. శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత అధికారం చేపట్టిన నూతన ప్రభుత్వం అయినా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

నారాయణవనం మండలంలో తుంబూరు వద్ద అరుణ నదిపై ఇదివరకు క్రితం నిర్మించిన పాత వంతెన గత ఏడాది వర్షాలకు కొట్టుకుపోయింది. పైపులు అమర్చి మట్టి పోసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. భారీ వర్షాలు వస్తే ఈ వంతెన పైనుంచి కొట్టుకుపోవడం ఖాయమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి పోసిన కారణంగా వంతెనపై గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. తుంబూరుకు అటు వైపు వున్న పలు గ్రామాల రైతులు చెరుకులోడులను తీసుకెళుతున్న సమయంలో వంతెనపై వున్న గుంతల్లో ట్రాక్టర్ చక్రాలు దిగి బోల్తా పడిన సందర్భాలు వున్నాయి. ఈ కారణంగా చెరుకు లోడ్లను ఇటు తీసుకెళ్లేందుకు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వంతెనపై చెరువు మట్టి తోలడంతో తేలికపాటి వర్షం పడితే బురదమయంగా మారి పాదచారులు, ద్విచక్రవాహనదారులు జారి పడే ప్రమాదం వుందని వాపోతున్నారు. ప్రస్తుతం పాలకులు ఎర్రమట్టి తీసుకొచ్చి గుంతలను తాత్కాలికంగా పూడ్చారు. అయినా వర్షం సమయంలో మట్టి కరిగి బురదగా మారి ఇబ్బంది కలిగిస్తోందని వాపోతున్నారు.

మండలంలోని పాలమంగళం ఉత్తరం మార్గంలోనూ వంతెన అసంపూర్తిగా దర్శనమిస్తోంది. తిరువట్యం వద్ద పాత వంతెన శిథిలమయింది. వర్షాలు వస్తే ఈ గ్రామాల ప్రజలు ఇక్కట్లలో పడిపోయే ప్రమాదం పొంచి వుంది. సంబంధిత శాఖల అధికారులు వంతెనలకు, చెరువు గట్లకు శాశ్వత మరమ్మతులు చేయాల్సిన అవసరం వుంది.

ఇసుక రీచ్, డంపింగ్ యార్డ్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గోడలే పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటుకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలో ఇసుక రీచ్ ను, డంపింగ్ యార్డును క్షుణ్ణంగా పరిశీలించి స్థానిక అధికారులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుకను తరలించే సమయంలో ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడీ శ్రీనివాస కుమార్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కే ప్రభాకర్ రావు, స్థానిక తహశీల్దారు కటారి జయజయరావు, డిప్యూటీ తహశీల్దారు అజమత్ ఖాన్, విఆర్‌ఓ సాయి శరణ్య, కృష్ణ, విలేజ్ సర్వేయర్ మహేష్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా, స్థానిక టిడిపి నాయకులు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, లక్కు రఘునాథరెడ్డి ఉన్నారు.



ఇసుక రీచ్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

పందులు స్వైరవిహారం

నివాసాల మధ్య యథేచ్ఛగా సంచారం

ప్రజాశక్తి - ఓజిలి:

మండల కేంద్రంలోని గ్రామ వీధుల్లో గుంపులు గుంపులుగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు నివాస ప్రాంతాల మధ్య యథేచ్ఛగా సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పందుల పెంపకం దారులు గ్రామ వీధుల్లో నివాసాలు మధ్య వదిలి వేస్తుండడంతో అవి ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. పందులు మురుగునీటి గుంటలు, చెత్తకుప్పలను ఆవాసాలుగా చేసుకుని సంచరిస్తున్నాయి. వీటి సంచారంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నివాస ప్రాంతాల్లో పందులు యథేచ్ఛగా తిరగడాన్ని నియంత్రించాలని స్థానిక అధికారులను, పాలకులను కోరుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. పందుల పెంపకం దారులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పందుల కారణంగా అనేక వ్యాధులు సోకే ప్రమాదం లేకపోలేదని ముఖ్యంగా మెదడు వాపు వ్యాధి.. చిన్నపిల్లల్లో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితికి దారితీస్తుంది. పందుల కారణంగా ఇన్ఫ్లూయెంజ వైరస్ సంక్రమించే అవకాశం వుంది. ఇది ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీస్తుందని, దీనివల్ల దగ్గు, జలుబు, జ్వరం దీర్ఘకాలిక సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రామ వీధుల్లో చిన్న పిల్లలు ఆటాడుకుంటున్న సమయంలో వారి పై తిరగ పడుతు న్నాయని ప్రజలు వాపోతున్నారు. పందులు పిల్లలతో సహా ఇంటి పరిసరాలలో సంచరిస్తూ ఇంటి పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం కలిగిస్తున్నాయని, వీటి వల్ల వచ్చే దుర్వాసన తట్టుకోలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



జనా వాసాల మధ్యే యథేచ్ఛగా సంచరిస్తున్న పందులు

తిరుమల బస్సు సర్వీస్‌లు ప్రారంభానికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు – తిరుమల బస్ సర్వీసులను త్వరలో తిరిగి పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రయాణికులకు హామీ ఇచ్చారు. గూడూరు ఆర్‌టిసి డిపోలో నూతనంగా ఏర్పాటు చేసిన గూడూరు– పొదలకూరు మూడు బస్సు సర్వీసులను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. గూడూరు – పొదలకూరు నూతన బస్సు సర్వీసులను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు తిరుమల బస్ సర్వీసులు వైసిపి పాలనలో ఎత్తివేయడం దారుణమని తిరిగి గూడూరు తిరుమల బస్ సర్వీస్ అందుబాటులోకి తీసుకొస్తామని అందుకు సంబంధించి సంబంధిత అధికారులు మంత్రితో చర్చిస్తామని పేర్కొన్నారు. అన్ని బస్సులు గూడూరు పట్టణంలోకి వచ్చే విధంగా డిపో మేనేజర్ చొరవ చూపాలని తాను కూడా ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గూడూరు ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అధికారులు చొరవ చూపాలని అవసరమైన మేర కు తమ నాయకులు సహకరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్, సిబ్బంది, టీడీపీ నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, వాటం బేడు శివ కుమార్, రహీమ్ పాల్గొన్నారు.



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

పారిశుధ్యంపై ఈవో ప్రత్యేక చర్యలు

- డ్రైనేజీలకు తాత్కాలిక మరమ్మతులు - గ్రామస్తుల హర్షం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: పారిశుధ్య పరిరక్షణపై ఈవో షణ్ముగం స్పందించారు. పంచాయతీలో డ్రైనేజీలకు తాత్కాలిక మరమ్మతులపై దృష్టి సారించారు. సమస్యల పరిష్కారానికి తనదైన రీతిలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. నారాయణవనం మేజర్ పంచాయతీలోని పలు వీధుల్లోని డ్రైనేజీల్లో మురుగు నీరు ముందుకు వెళ్లకుండా స్థానిక వ్యాపారులు కొందరు నిర్లక్ష్యం వల్ల కాలువల్లో ప్లాస్టిక్ బాటిల్స్, సీసా పెంకులు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు కాలువల్లో ఇరుక్కుపోయాయి. దీంతో కాలువల్లో మురుగు నీరు ముందుకు సాగకుండా నిల్చిపోయింది. దీన్ని గమనించిన పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలలో చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మేజర్ పంచాయతీయలో వున్న చిల్లర కొట్టు యజమానులకు, ప్రజలకు, టీ స్టాల్స్, హోటళ్లు, ఇతర వ్యాపారులకు చెత్త బుట్టను ప్రతి షాపు బయట ఏర్పాటు చేసి అందులో బాటిల్స్, టీ కప్పులు, ప్లాస్టిక్ పేపర్, ఇతర వస్తువులు వేసి పంచాయతీ సిబ్బందికి అందించి 'మన ఊరు, మన గ్రామస్తుల బాగు కోసం మీ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలి..' అంటూ పలు సూచనలు ఇచ్చారు. కొందరు వ్యాపారుల నిర్లక్ష్యం వల్ల వర్షానికి డ్రైనేజీలో మురికి నీరు వెళ్లడానికి దారిలేక రోడ్ల మీద మురికి నీరు వెళ్లే దుస్థితి ఏర్పడింది. ఈ తీరు మానుకుని వ్యాపారులు తన కర్తవ్యం సక్రమంగా నిర్వహించాలని కోరారు. అనంతరం స్థానికులు, వాహన దారులు, గ్రామస్తులు ఈవోకి కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.



డ్రైనేజీలలో చెత్తా చెదారాన్ని వెలికి తీస్తున్న పంచాయతీ పారిశుధ్య సిబ్బంది

క్వారీకి అనుమతి

- ప్రజాభిప్రాయ సేకరణకు తిలోదకాలు
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

ప్రజాశక్తి - ఓజిలి: ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోకుండా అధికారులు క్వారీకి యథేచ్ఛగా అనుమతులు ఇవ్వడంపై గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరిమానుపాడు గ్రామంలో సర్వేనెంబర్ 65 కొండ పోరంబోకు భూములలో గ్రావెల్ మెటల్ కోసం ఓ సంస్థ సుమారు నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వ అధికారులు ఈ సంస్థకు అనుమతులు ఇచ్చే విషయం గురించి బహిరంగంగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజాభిప్రాయ సేకరణలో ఇక్కడ క్వారీ ఏర్పాటు చేయడంపై ఆరిమానుపాడు పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. క్వారీ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో పశువులకు మూగజీవాలకు మేత సమస్య ఏర్పడుతుందని. మనుషులకు కూడా ప్రాణాపాయం కగులుగుంతని అధికారుల ముందు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కానీ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా క్వారీకి అనుమతులు ఇవ్వడంపై గ్రామస్తులు అధికారుల మీద మండిపడుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక గ్రామస్తుల సంతకాలు పెట్టకపోవడంతో పక్క మండలానికి చెందిన గ్రామస్తులతో సంతకాలు తీసుకొని అడ్డదారిలో అనుమతులు పొందుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అవసరం అయినప్పుడు వారి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఎలా అనుమతులు ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. క్వారీ నిర్వాహకులు 2022వ సంవత్సరంలో అనుమతులు పొందినప్పుడు పనులు చేయకుండా ఇప్పుడు పనులు చేయడంలో గల ఆంతర్యం ఏమిటని? ప్రశ్నిస్తున్నారు. అనుమతులు పొందినప్పుడు ఎందుకు పనులు చేయలేదు ? ఇప్పుడు ఎందుకు పనులు చేస్తున్నారో అన్న విషయాన్ని కూడా వారు స్పష్టంగా తెలియజేయాలని ఇటీవల గ్రామస్తులు రెవెన్యూ అధికారులను నిలదీస్తూ నిరసన తెలిపారు. అధికారుల చేతివాటం పై గ్రామస్తులు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. దీనిపై రాజకీయ కోణం అంతరించుకోవడంతో . ప్రజలకు వ్యతిరేకంగా క్వారీ నిర్వహణ చేపట్టాలని క్వారీ యాజమాన్యం అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో బహిరంగంగా ప్రజా అభిప్రాయ సేకరణ సేకరించాలని స్థానిక గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.



ప్రజాభిప్రాయం లేకుండా అధికారులు అనుమతి ఇచ్చిన క్వారీ ఇదే..

వైభవంగా కల్యాణ వెంకన్న రథోత్సవం

ప్రజాశక్తి -రామచంద్రాపురం:

తిరుపతి రూరల్ మండలంలోని తుమ్మలగుంట కళ్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు బ్రహ్మరథంపై ఊరేగారు. గోవింద నామస్మరణలతో బ్రహ్మరథాన్ని భక్తులు ముందుకు లాగుతుండగా స్వామి, అమ్మవార్లు రథంపై విహరించారు. ఆలయం నుంచి బయలుదేరిన బ్రహ్మరథానికి ఉప్పు, మిరియాలు చల్లుతూ మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవారి రథోత్సవం ముందు వృషభాలు, అశ్వాలు ఠీవీగా నడుస్తుండగా కళాకారులు, చెక్క భజనలు, కేరళ వాయిద్యాలు, కళాకారుల దేవతా రూపాలతో శోభాయమానంగా సాగింది. ప్రధాన ఆలయం నుంచి ఉదయం 7గంటలకు బయలుదేరి స్వామి బ్రహ్మరథం 11.30 గంటలకు తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

అశ్వవాహనంపై కల్కి అవతారం

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి అశ్వవాహనంపై కల్కి అవతారంలో శుక్రవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహన సేవల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులు, కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలతో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

నేడు చక్రస్నానం

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవ రోజు శనివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల మధ్యన చక్రతాళ్వార్‌కు అభిషేకం నిర్వహించిన పుష్కరణిలో చక్రస్నానం చేయించనున్నారు. పుష్కరణి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించిన అనంతరం పుష్కరణిలో చక్రతాళ్వార్‌కు స్నానం చేయించనున్నారు. బ్రహ్మోత్సవాలలో ఆఖరి ఘట్టంగా చక్రస్నానం నిర్వహించడం ఆనవాయితీ. అదే రోజు సాయంత్రం జరిగే ధ్వజ అవరోహణంతో ఉత్సవాలు ముగిస్తారు.

వినీత్‌కు పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి నగరి నియోజక వర్గ పుత్తూరు పట్టణ ముద్దుకృష్ణాపురానికి చెందిన నాయకురాలు నాగరత్నం రెండవ కుమారుడు వై వినీత్ రెండు రోజులు క్రితం ద్విచక్ర వాహనంలో వెళుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో టిడిపి కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయ పడి చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వై వినీత్ ను శుక్రవా రం ముద్దుకృష్ణాపురంలోని ఆమె ఇంటికి వెళ్లి ఆయన పరామర్శించారు. ప్రమాదంలో పాడైన ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. చికిత్సకు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరత్నం మాట్లాడుతూ తన పెద్ద కుమారుడు కౌశిక్ డిగ్రీ చదివి నిరుద్యోగిగా వున్నాడని, ఉపాధి కల్పించాలని విజయ్ బాబును కోరారు. స్పందించిన విజయ్ బాబు ఆమె కుమారు డికి ఉద్యోగం ఇప్పిం చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చా రు. టిడిపి కార్యకర్తలు ఎవరైనా సమస్యతో తన వద్దకు వస్తే తాను వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపిటిసి, శ్రీజ బాలాజీ నాయుడు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇ రవి నాయుడు, మాజీ ఎంపిటిసి పాండురంగయ్య , ఇతర నాయకులు దాసరి విజయ్ చౌదరి, హెచ్ సుబ్రమణ్యం, అరవ ప్రకాష్, పరంధామయ్య, సారథి, కుమార్ రెడ్డి, పోతుగుంట రమేష్ పాల్గొన్నారు.



వినీత్‌ను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు పోతుగుంట విజయబాబు

ఘనంగా పెద్దిరెడ్డి జన్మదినం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి నాయకులు శుక్రవారం నారాయణవనంలో ఘనంగా నిర్వహించారు. పెద్దిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైసిపి మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపిపి దివాకర్ రెడ్డి, వైసిపి నాయకులు ఆధ్వర్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ సొరకాయలు కేక్ కట్ చేసి పెద్దిరెడ్డి పుట్టిన రోజును నిర్వహించారు. వైసిపిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పెద్దిరెడ్డి అడుగుజాడల్లో నడుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నదురై, కిరణ్, సాయిరవి, అశోక్, ముని, పీజీ బాబు, చీరాలయ్య, సర్పంచ్‌లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో ఓ వృద్ధుడు, చంద్రగిరి మండలంలో మరో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు శుక్రవారం చోటుచేసుకున్నాయి.

గూడూరు పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు శుక్రవారం ఉచివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గూడూరు ఒకటవ పట్టణ సీఐ శేఖర్ బాబు కథనం మేరకు 60 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైల్వే క్వార్టర్స్ సమీపంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు సమాచారం అందించారన్నారు. వెళ్లి పరిశీలించగా మృతుడు బ్లూ కలర్ చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చంద్రగిరిలో..

రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం, రాయలపురం పంచాయతీలో గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచా రం అందించారు. పోలీసుల కథనం మేరకు.. రాయల్ పురం సమీపంలోని భారీ వృక్షంపై ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెట్టు ఎక్కి 20 అడుగుల ఎత్తులో దారం కట్టుకుని ఉరి వేసుకుని దూకి ఆత్మహత్య చేసుకున్నాడని కపోలీసులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. యువకుడికి సంబంధించి వివరాలు తెలిసినవారుతమకు సమాచారం ఇవ్వాలని చంద్రగిరి పోలీసులు తెలిపారు.

రతన్ టాటాకు నివాళులు



రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న దీన దయాల్

ప్రజాశక్తి- తిరుపతి: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా సేవలు భారతదేశానికి రత్నాలు లాంటివని శ్రీ లక్ష్మీ దీన దయాల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దీన దయాల్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రతన్ టాటా చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దీనదయాల్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు గర్వించదగ్గ మహన్నత వ్యక్తి రతన్ టాటా అని కొనియాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్రాజు సుకుమార్ రాజు మాట్లాడుతూ సేవలకు మానవత్వం ముఖ్యమని పేర్కొన్నారు. వ్యక్తులు ఏ స్థాయిలో వున్నా సేవ చేయాలనే సంకల్పం ఉంటే సంపూర్ణ సహాయ సహకారాలు అవే వస్తాయన్నారు. రతన్ టాటా లేని లోటు భారతదేశానికి తీర్చని లోటు అన్నారు. రతన్ టాటా సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మద్యం అమ్మకాలకు

చంద్రగిరిలో 150 దరఖాస్తులు

ప్రజాశక్తి రామచంద్రాపురం(చంద్రగిరి):

మద్యం దుకాణాల టెండర్లకు దరఖాస్తుల గడువు శుక్రవారం ముగిసింది. గతంలో అక్టోబర్ 9 వ తేదీ ఆఖరి తేదీగా ప్రకటించిన ప్రభుత్వం ఆశించినన్ని టెండర్లు రాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందన్న ఉద్దేశంతో బ్యాంకు సెలవుల నెపంతో మరో రెండు రోజులు పెంచి అక్టోబర్ 11వ తేదీ వరకు గడువు పెంచి టెండర్లు దరఖాస్తులకు అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చంద్రగిరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో 17 మద్యం దుకాణాలకు శుక్రవారం సాయంత్రం వరకు మొత్తం 150 దరఖాస్తులు వచ్చినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ పణీంద్ర కుమార్ చెప్పారు. మండలాల వారీగా గురువారం వరకు చంద్రగిరిలో 7 దుకాణాలకు 48 దరఖాస్తులు, పాకాలలో 5 దుకాణాలకు 11 దరఖాస్తులు, చిన్న గొట్టిగల్లులో 3 దుకాణాలకు 18 దరఖాస్తులు, యర్రావారి పాలెంలో రెండు దుకాణాలకు 16 దరఖాస్తులు వచ్చాయని ఆయన వివరించారు. గతంలో గురువారంతో ముగిసిన దరఖాస్తుల తేదీని 11 వ తేదీ సాయంకాలం 7 గంటల వరకు రెండు రోజులు పొడిగించిందని తెలిపారు. వచ్చిన దరఖాస్తులలో ఈ నెల 14 వ తేదీ ఉదయం లక్కీ డ్రా తీసి మద్యం దుకాణాలు కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న మద్యం పాలసీ 15 వ తేదీతో ముగుస్తుందని 16 వ తేదీ నుంచి నూతన పాలసీ అమలులోకి వస్తుందని చెప్పారు. సర్వర్ నిదానం కావడంతో చంద్రగిరి సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాలకు శుక్రవారం వరకు అందిన దరఖాస్తుల వివరాలను అధికారులు వివరించలేకపోయారు.

శ్రీకాళహస్తిలో 240 దరఖాస్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎక్సైజ్ శాఖా డివిజన్ పరిధిలో మొత్తం 30 మద్యం దుకాణాలకు 240 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖా సీఐ లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తద్వారా రూ.4.80 కోట్ల నగదు డిపాజిట్ అయినట్లు వెల్లడించారు. శ్రీకాళహస్తి టౌన్, గ్రామీణంలో 12 షాపులకు 83 దరఖాస్తులు, బుచ్చినాయుడు కండ్రిగలో 5 షాపులకు 57, కేవీబీపురంలో 3 షాపులకు 49, తొట్టంబేడులో 3 షాపులకు 15, ఏర్పేడులో 7 షాపులు గాను 36 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు.

దుర్గాదేవి అలంకరణలో మూలస్థాన ఎల్లమ్మ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ దేవస్థానంలో దేవి నవరాత్రులలో భాగంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అమ్మవారి పూలతేరు సేవలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో చంద్రగిరి పురవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఓం శక్తి భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా తిరుపతికి చెందిన మాజీ డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి , చంద్రగిరికి చెందిన చేగు కుటుంబ సభ్యులు, గుమ్మ రాజు స్వర్ణాంబ రామనరసింహారావు, మీనమ్మ సదాశివ రెడ్డి వ్యవహరించారు. ఈ ఊరేగింపులో ఉత్సవ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణా ధికారి కె మమత పాల్గొన్నారు.